RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

వరంగల్ | శుక్రవారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:63 | ఫిబ్రవరి 13, 2026 | వెల: రూ.3-00

దినపత్రిక




హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికల్లో

## గులాబీ జెండానే ఎగురుతుంది

- తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే రక్షణ
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2లో




# కౌంటింగ్ టెన్షన్!

## 123 పురపాలికల్లో ఎవరిది పైచేయి?

- ఎవరికి వారు సత్తా చాటుతామంటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్
- అభ్యర్థులను వెంటాడుతున్న ఓటమి భయం
- క్రాస్ ఓటింగ్ జరిగిందా అని అనుచరులతో ఆరా
- ఓడితే మెడ మీద అప్పుల కత్తి
- ఫలితాలు రాకముందే కొన్నిచోట్ల పొత్తులు
- కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- మధ్యాహ్నం వరకు తేలనున్న ఫలితాలు
- విజయోత్సవ ర్యాలీలకు అనుమతి నిరాకరణ.. పోలీసుల భారీ బందోబస్తు

2లో




## నేడే మున్సిపల్ ఎన్నికల ఫలితాలు

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

తెలంగాణలో నెలరోజులుగా హోరాహోరీగా సాగిన పుర పోరు నేటితో క్లైమాక్స్‌కు చేరుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల పరిధిలో 12,930 మంది అభ్యర్థుల జాతకం మరికొద్ది గంటల్లో తేలనుంది. ఉదయం 8 గంటల నుంచే బ్యాలెట్ బాక్సుల సీళ్లు తెరుచుకోనుండటంతో అభ్యర్థుల్లో టెన్షన్ పరాకాష్టకు చేరింది. అధికార బలంతో క్లీన్ స్వీప్ చేస్తామని కాంగ్రెస్, పట్టణ ఓటు బ్యాంకు తమదేనని బీఆర్ఎస్ ధీమా వ్యక్తం చేస్తుండగా, కమలం పార్టీ సైతం అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. అయితే, లోపాయికారీ ఒప్పందాలు, క్రాస్ ఓటింగ్ భయం, ఆస్తులు తాకట్టు పెట్టి తెచ్చిన అప్పుల గుబులు అభ్యర్థులను వణికిస్తున్నాయి. మరోవైపు, ఘర్షణలు చోటుచేసుకోకుండా పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా కౌంటింగ్ కేంద్రాల వద్ద హై-అలర్ట్ ప్రకటించారు. పీఠం ఎవరికి దక్కుతుందో, ఎవరి రిపోర్ట్ కార్డులు ఎలా ఉండబోతున్నాయో మధ్యాహ్నం కల్లా తేలిపోనుంది!

## సింగరేణి సీఎండీగా జ్యోతి బుద్ధ ప్రకాష్ బాధ్యతల స్వీకరణ



**వేద న్యూస్, మంచిర్యాల**

సింగరేణి సంస్థ సీఎండీగా నియమితులైన సీనియర్ ఐఏఎస్ అధికారి డా. జ్యోతి బుద్ధ ప్రకాష్ గురువారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో అధికారిక బాధ్యతలు స్వీకరించారు. సింగరేణి భవన్‌కు చేరుకున్న ఆయనకు జనరల్ మేనేజర్ తాడబోయిన శ్రీనివాస్ స్వాగతం పలికారు. అనంతరం ఛైర్మన్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టగా, డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, గౌతం పొట్రు, బి. వెంకన్న పుష్ప గుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ కార్యకలాపాలపై డైరెక్టర్లు సీఎండీకి వివరించారు. డా. జ్యోతి బుద్ధ ప్రకాష్ 2002 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి. ఆయన తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యదర్శిగా, రాష్ట్ర ప్రణాళికా శాఖ కార్యదర్శిగా పనిచేశారు. అదిలాబాద్ జిల్లా కలెక్టర్‌గా, భద్రాచలం ఐటిడిఏ పీఓగా కూడా సేవలందించారు. సింగరేణి సీఎండీగా ఆయన బాధ్యతలు స్వీకరించడంపై సంస్థలో మరియు అధికార వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.



2లో

రాష్ట్రంలో 44 వేలకుపైగా

## అక్రిడిటేషన్ కార్డులు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



## నా డబ్బులు నాకివ్వండి

- ఓటు వేయలేదని డబ్బులు, కుక్కర్లు అడిగిన అభ్యర్థి
- ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానికులు
- అశ్వారావుపేట మున్సిపాలిటీలో ఘటన

2లో



2లో

గాంధీ సరోవర్ శంకుస్థాపనకు

## రాజ్‌నాథ్ సింగ్‌కు ఆహ్వానం

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు వివరాలు తెలిపిన సీఎం రేవంత్

## గాంధీ సరోవర్ శంకుస్థాపనకు
# రాజ్‌నాథ్ సింగ్‌కు ఆహ్వానం

**మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు వివరాలు తెలిపిన సీఎం రేవంత్**

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా ఈసా–మూసీ నదుల సంగమ స్థలంలో నిర్మించనున్న గాంధీ సరోవర్ శంకుస్థాపన కార్యక్రమానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా సౌత్ బ్లాక్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. మూసీ నది పునరుజ్జీవనానికి పర్యావరణ హిత చర్యలు చేపడుతున్నట్లు సీఎం వివరించారు. బాపూ ఘాట్ సమీపంలో గాంధీజీ ఆశయాలను ప్రతిబింబించేలా గాంధీ సరోవర్‌ను నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టును ప్రపంచ స్థాయి విద్యా, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఫిబ్రవరి చివర్లో జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి హాజరుకావాలని రాజ్‌నాథ్ సింగ్‌ను సీఎం కోరారు. ఈ సమావేశంలో పలువురు ఎంపీలు పాల్గొన్నారు.

# హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికల్లో గులాబీ జెండానే ఎగురుతుంది

**తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే రక్షణ**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

హైదరాబాద్ మహానగరంలో రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో ఎన్ని కార్పొరేషన్లు చేసినా గెలిచేది గులాబీ జెండానేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన యువ నాయకుడు విజయ్ కుమార్ రెడ్డి తన అనుచరులతో కలిసి తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌లో చేరగా, కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. ఎమ్మెల్యేలు వెళ్లినా పార్టీ వెన్నెముక కార్యకర్తలేనన్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే పార్టీని వీడినా కార్యకర్తలు మాత్రం కేసీఆర్ నాయకత్వంలోనే ఉన్నారని ప్రశంసించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పార్టీకి నంబర్ వన్ కోటగా నిలిచిందని, 24 డివిజన్లలో క్లీన్ స్వీప్ చేసే సత్తా తమకుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అబద్ధపు హామీలతో అధికారం దక్కించుకుందని, బీజేపీ తెలంగాణకు పనికిరాని పార్టీగా మారిందని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. నగరంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయని, వ్యాపారాలు కుదేలయ్యాయని ఆరోపించారు. త్వరలో కార్పొరేషన్ ఎన్నికల దృష్ట్యా డివిజన్ల వారీగా సమావేశాలు నిర్వహించి పార్టీని మరింత పటిష్టం చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యేలు లేకపోయినా కార్యకర్తలకు అండగా తాను, తలసాని శ్రీనివాస్ యాదవ్, అరికెపూడి, కృష్ణారావు ఉంటామని హామీ ఇచ్చారు. చదువుకున్న యువత రాజకీయాల్లోకి రావడం శుభపరిణామమని, విజయ్ కుమార్ రెడ్డి వంటి యువ నాయకులు పార్టీకి ఆస్తి అని కేటీఆర్ పేర్కొన్నారు.

# జగ్గారెడ్డిపై కేసు నమోదు

**పోలింగ్ కేంద్రంలో ఉద్రిక్తత..**

**న్యాయస్థానంలో తేలుతుందని వ్యాఖ్య**

**వేద న్యూస్, సంగారెడ్డి**

పురపాలక ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఎన్నికల సిబ్బంది విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలతో కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అధికారుల ఫిర్యాదు మేరకు భారతీయ న్యాయ సంహితలోని పలు సెక్షన్ల కింద సంగారెడ్డి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం సంగారెడ్డి 34వ వార్డు పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్ అభ్యర్థిని సీఐ అనుచితంగా వ్యవహరించారని ఆరోపిస్తూ జగ్గారెడ్డి అక్కడికి చేరుకుని పోలీసులను ప్రశ్నించారు. ఈ క్రమంలో కొంతసేపు ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు జగ్గారెడ్డిని, కార్యకర్తలను అడ్డుకున్నారు. తనపై కేసు నమోదు చేయడంపై జగ్గారెడ్డి స్పందిస్తూ, దొంగ ఓట్లను అడ్డుకునే ప్రయత్నంలోనే అక్కడికి వెళ్లినట్లు తెలిపారు. ఈ ఘటనలో నిజానిజాలు న్యాయస్థానంలో తేలుతాయని పేర్కొన్నారు. ఈ ఘటనతో సంగారెడ్డిలో రాజకీయ ఉద్రిక్తత నెలకొంది.



# కౌంటింగ్ టెన్షన్!

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నేడు మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ పర్వం ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని 2,996 వార్డులకు సంబంధించిన ఫలితాలు వెలువడనున్నాయి. గత నెల రోజులుగా సాగిన రాజకీయ యుద్ధం నేటితో ముగియనుంది. ఉదయం 8 గంటలకు బ్యాలెట్ బాక్సుల సీళ్లు తెరుచుకోనుండటంతో అభ్యర్థుల్లో టెన్షన్ పరాకాష్టకు చేరింది. మధ్యాహ్నం 12 గంటల కల్లా తొలి ఫలితం వెలువడే అవకాశం ఉండటంతో, పట్టణ పీఠం ఎవరికి దక్కుతుందనే ఉత్కంఠ రాష్ట్రవ్యాప్తంగా నెలకొంది.




**కాంగ్రెస్, బీఆర్ఎస్ ధీమా..**

రాష్ట్రంలోని రెండు ప్రధాన పార్టీలు తమదే గెలుపు అని ప్రకటించుకుంటున్నాయి. అధికార బలం, ఆరు గ్యారెంటీలు తమను క్లీన్ స్వీప్ చేయిస్తాయని కాంగ్రెస్ భావిస్తోంది. ముఖ్యంగా 7 కార్పొరేషన్లలోనూ మేయర్ పీఠం దక్కించుకోవడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఫలితాల ఆధారంగానే సీఎం రేవంత్ రెడ్డి మంత్రుల పని తీరును అంచనా వేయనుండటంతో మంత్రులు అగ్నిమీద ఉన్నట్లు ఉన్నారు. పట్టణాల్లో తమ పట్టు సడలలేదని, పట్టభద్రులు, యువత తమకే ఓటు వేశారని గులాబీ నేతలు ధీమాగా ఉన్నారు. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత తమకు కలిసివస్తుందని అంచనా వేస్తున్నారు. ఉత్తర తెలంగాణలో కమలం జెండా రెపరెపలాడుతుందని, గతంతో పోలిస్తే సీట్ల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని బీజేపీ లెక్కలు వేస్తోంది.

**కంటిమీద కునుకేది?**

పోలింగ్ ముగిసినప్పటి నుంచి అభ్యర్థులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. దీనికి క్రాస్ ఓటింగే ప్రధాన కారణం. సొంత పార్టీ నుండే ముప్పు ఉండడం, టికెట్ దక్కని అసమ్మతి నేతలు పార్టీలోనే ఉంటూ ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులకు ఓటు వేయించారనే భయం కొందరు అభ్యర్థులను వణికిస్తోంది. ముఖ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లో ఈ అసమ్మతి సెగ ఎక్కువగా ఉండటంతో, ఫలితాలు తారుమారయ్యే అవకాశం ఉందని నేతలు లోలోపల మదనపడుతున్నారు. వార్డుల్లో ఓటర్లకు భారీగా డబ్బు పంపిణీ చేసిన అభ్యర్థులు.. డబ్బు తీసుకున్న ఓటర్లు మనకే ఓటు వేశారా? లేక వేరే గుర్తుకు వేశారా?" అని తమ ఏజెంట్లతో చర్చలు జరుపుతున్నారు.

**కౌంటింగ్ ఏర్పాట్లు ఇలా..**

రాష్ట్రవ్యాప్తంగా 136 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంది. భారీగా పోలీసుల విధులు నిర్వర్తిస్తున్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్లు లెక్కించి, ఆ తర్వాత వార్డుల వారీగా లెక్కింపు చేపడతారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి పూర్తి స్థాయి ఫలితాలు వెలువడతాయి. మొత్తంగా ఓటరు తీర్పు బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైంది. 12,930 మంది అభ్యర్థుల భవిష్యత్తు తేలనుంది.

**గెలవకపోతే అప్పులే దిక్కు**

ఈ ఎన్నికల్లో అభ్యర్థులు పెట్టిన ఖర్చు మునుపెన్నడూ లేనంతగా ఉంది. మున్సిపల్ వార్డు స్థాయిలోనే అభ్యర్థులు సగటున రూ. 50 లక్షల నుండి రూ. కోటిన్నర వరకు ఖర్చు చేసినట్లు సమాచారం. చాలా మంది అభ్యర్థులు తమకున్న వ్యవసాయ భూములు, ఇళ్లు, బంగారాన్ని తాకట్టు పెట్టి మరీ ఎన్నికల బరిలో నిలిచారు. గెలిస్తే కాంట్రాక్టులు, పై సంపాదనతో గట్టెక్కవచ్చు.. అదే ఓడిపోతే ఈ అప్పులు తీర్చేదెలా? అని సన్నిహితుల వద్ద వాపోతున్నారు. ఓటమి వార్త వింటే గుండె ఆగే పరిస్థితి ఉందని కొందరు అభ్యర్థులు కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లడానికి కూడా జంకుతున్నారు.

**మ్యాచ్ ఫిక్సింగ్..**

కొన్ని చోట్ల హంగ్ ఏర్పడే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు చెబుతున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని గెలిచిన స్వతంత్రులను, ఇతర పార్టీల నేతలను తమ వైపు తిప్పుకోవడానికి అప్పుడే మ్యాచ్ ఫిక్సింగ్ మొదలైంది. ఫలితాలు వచ్చిన వెంటనే క్యాంప్ రాజకీయాలకు తెరలేవనుంది.

**నేడే మున్సిపల్ ఎన్నికల ఫలితాలు**


- 123 పురపాలికల్లో ఎవరిది పైచేయి?
- ఎవరికి వారు సత్తా చాటుతామంటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్
- అభ్యర్థులను వెంటాడుతున్న ఓటమి భయం
- క్రాస్ ఓటింగ్ జరిగిందా అని అనుచరులతో ఆరా
- ఓడితే మెడ మీద అప్పుల కత్తి
- ఫలితాలు రాకముందే కొన్నిచోట్ల పొత్తులు
- కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- మధ్యాహ్నం వరకు తేలనున్న ఫలితాలు
- రిజల్ట్ ను దృష్టిలో ఉంచుకుని పోలీసుల భారీ బందోబస్తు

**ఫలితాల వేళ హై అలర్ట్!**

మున్సిపాలిటీల ఫలితాల వెల్లడి నేపథ్యంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ శాఖ గట్టి బందోబస్తును ఏర్పాటు చేసింది. పోలింగ్ రోజున కరీంనగర్, నిజామాబాద్, మహబూబాబాద్ వంటి ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఘర్షణలను దృష్టిలో ఉంచుకుని, కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. భారీ భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు. గెలిచిన అభ్యర్థులు బాణసంచా కాల్చడం, విజయోత్సవ ర్యాలీలు తీయడంపై ఆంక్షలు విధించారు. ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించడంతో పాటు, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టే వారిపై సైబర్ క్రైమ్ పోలీసులు నిఘా ఉంచారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని డీజీపీ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు.

## రాష్ట్రంలో 44 వేలకుపైగా
# అక్రిడిటేషన్ కార్డులు

- ప్రక్రియ మరింత పారదర్శకంగా.. అర్హులందరికీ న్యాయం
- సవరణలతో కార్డుల సంఖ్యలో భారీ పెరుగుదల
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**వేద న్యూస్ హైదరాబాద్ ప్రతినిధి**

రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకూ అక్రిడిటేషన్ కార్డు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం పట్ల పూర్తి నిబద్ధతతో పని చేస్తోందన్నారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ విధానం, కమిటీ ఏర్పాటు తదితర అంశాలపై సచివాలయంలో సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ సిహెచ్ ప్రియాంక, ముఖ్యమంత్రి సిపిఆర్‌వో జి మల్సూర్‌లతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా సాగేందుకు అవసరమైన దిశానిర్దేశాలు చేశారు. ప్రభుత్వం ముందుగా జి.ఓ. 252 జారీ చేయగా, అనంతరం జర్నలిస్టు సంఘాల సూచనల మేరకు సవరణలు చేసి జి.ఓ. 103ను జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. తాజా సవరణలతో రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా విభాగాల్లో మొత్తం 44,706 అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసే అవకాశం కలుగుతుందని తెలిపారు. గతంలో సుమారు 23 వేల మందికి మాత్రమే కార్డులు ఉండగా, ఇప్పుడు దాదాపు 21 వేలకుపైగా అదనంగా కార్డులు మంజూరు అవుతాయని వివరించారు. 2.50 లక్షలకుపైగా సర్క్యులేషన్ ఉన్న 8 పత్రికలకు 6,256 కార్డులు, 75 వేల నుంచి 2.50 లక్షల వరకు సర్క్యులేషన్ ఉన్న 24 పత్రికలకు 17,784 కార్డులు, 25,001 నుంచి 75 వేల వరకు సర్క్యులేషన్ ఉన్న 30 పత్రికలకు 3,390 కార్డులు మంజూరు అవుతాయని తెలిపారు. అదేవిధంగా 15,001 నుంచి 25,000 వరకు సర్క్యులేషన్ ఉన్న 169 చిన్న పత్రికలకు 11,661 కార్డులు, 15 వేలలోపు సర్క్యులేషన్ ఉన్న 113 చిన్న పత్రికలకు 226 కార్డులు, పీరియాడికల్స్‌కు 624, 20 న్యూస్ ఏజెన్సీలకు 68 అక్రిడిటేషన్లు ఇస్తామని చెప్పారు. 21 శాటిలైట్ ఛానళ్లకు 4,431 కార్డులు, 8 జాతీయ ఛానళ్లకు 32, 100 లోకల్ కేబుల్ ఛానళ్లకు 200, డిజిటల్ మీడియాకు 10 కార్డులు కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో 16,056 కార్డులు, నియోజకవర్గ, మండల స్థాయిలో 28,650 కార్డులు మంజూరు అవుతాయని వివరించారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, అవసరమైతే మరిన్ని సవరణలు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభమైన మీడియా ప్రతినిధుల గౌరవం, భద్రత, సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.



## ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి
# కవిత పుష్పాంజలి

**అమరవీరులకు రెండు నిమిషాల మౌనం**

**తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో కార్యక్రమం**

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సభలో జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుంటూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. తెలంగాణ సాధనలో ఉద్యమకారుల త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఉద్యమ స్ఫూర్తిని తరతరాలకు అందించే లక్ష్యంతో ఈ సభ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## రూ.2200 కోట్ల ఆస్తిని
# కాపాడిన హైడ్రా

**11 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం**

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

మాధాపూర్ హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ సమీపంలో హైడ్రా గురువారం భారీ ఆపరేషన్ చేపట్టింది. మొండికుంట చెరువుతో పాటు పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిపై సాగుతున్న ఆక్రమణలను తొలగించి సుమారు 11 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుంది. ఈ భూమి విలువ దాదాపు రూ.2200 కోట్లుగా అంచనా వేస్తున్నారు.రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామంలోని సర్వే నంబరు 53లోని మొండికుంట, సర్వే నంబరు 55లోని ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురవుతోందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఆలయాన్ని హద్దుగా చూపిస్తూ ఆక్రమణలు చేసినట్లు అధికారులు గుర్తించారు. ఆలయం చుట్టూ మెకానిక్ షెడ్లు, ఇనుము దుకాణాలు, ఇతర తాత్కాలిక నిర్మాణాలు ఏర్పాటు చేసి 30కి పైగా దుకాణాలు నిర్వహిస్తున్నట్లు తేలింది. ఈ షాపుల ద్వారా నెలకు లక్షల్లో అద్దెలు వసూలు చేస్తున్నట్లు సమాచారం.



# నా డబ్బులు నాకివ్వండి

**ఓటు వేయలేదని డబ్బులు, కుక్కర్లు అడిగిన అభ్యర్థి**

**ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానికులు**

**అశ్వారావుపేట మున్సిపాలిటీలో ఘటన**

**అవమానకరంగా మాట్లాడారంటూ ప్రజల ఆగ్రహం**

**వేద న్యూస్, భద్రాద్రి కొత్తగూడెం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మున్సిపాలిటీలోని 10వ వార్డులో ఓ కాంగ్రెస్ అభ్యర్థి ప్రవర్తన వివాదాస్పదంగా మారింది. తనకు ఓటు వేయలేదని ఆరోపిస్తూ ముందుగా పంచిన డబ్బులు, కుక్కర్లు తిరిగి ఇవ్వాలని ప్రజలను కోరినట్లు సమాచారం. స్థానికుల వాదన ప్రకారం, ఓటు వేయలేదని కారణం చూపుతూ అభ్యర్థి అవమానకరంగా మాట్లాడినట్లు ఆరోపించారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. డబ్బులు, కుక్కర్లు ఇవ్వమని ఎవరడిగారని, ఎందుకు ప్రజలను అవమానిస్తున్నారని స్థానికులు నిలదీశారు. ఈ ఘటనపై వార్డు ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ప్రలోభాలకు గురి చేసి, అనంతరం అవమానకరంగా వ్యవహరించడం తగదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాల్సిన హక్కు అని స్పష్టం చేశారు. ఈ సంఘటనపై స్థానిక అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలి

- ఉపాధి హామీని పునరుద్ధరించాలి
- సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో



**వేద న్యూస్, నల్లబెల్లి:**

మోడీ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు, రైతు విత్తన బిల్లు, నూతన విద్యుత్ ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలని, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రం నల్లబెల్లిలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం పార్టీల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్ట్, మిల్ హమాలి, భవన నిర్మాణ కార్మికులు, గ్రామపంచాయతీ సిబ్బంది, రైతు కూలీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మికులు, రైతులు, ఉద్యోగులు మరియు కూలీలకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన బిల్లులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు రక్షణగా ఉన్న పాత చట్టాలను రద్దు చేసి, కొత్త లేబర్ కోడ్‌ల ద్వారా వారి హక్కులను హరించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. రైతు విత్తన బిల్లు ద్వారా కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చే విధంగా చర్యలు తీసుకుంటున్నారని, దీని వల్ల విత్తనాల నాణ్యత, రైతుల హక్కులు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే నూతన విద్యుత్ ఒప్పందాలు ప్రజలకు భారంగా మారే అవకాశముందని పేర్కొన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్రం కేటాయించే నిధుల వాటాను తగ్గించడం వల్ల పథకం బలహీనపడుతోందని, ఇది పరోక్షంగా ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రలో భాగమని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను వెంటనే విరమించకపోతే జాతీయ స్థాయిలో వామపక్షాలు, ప్రజాతంత్ర శక్తులు చేపట్టే ఉద్యమాల్లో సకల రంగాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమ హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మోడీ, ట్రంప్ చిత్రపటాలు మరియు లేబర్ కోడ్ ప్రతులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతి రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అక్కపెల్లి రమేష్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు చింతకింది కుమారస్వామి, సిపిఎం మండల కార్యదర్శి కడియాల మనోహర్, సిపిఎం సీనియర్ నాయకుడు కడియాల వీరాచారి, బొడిగె సమ్మయ్య, ఎంసిపిఐ (యు) మండల కార్యదర్శి దామ సాంబయ్య, చరణ్ సింగ్, బత్తిని మహేష్, ఆవాల సంపత్ రావు, జక్కుల రవి, బూస కుమారస్వామి, పరికిరత్నం, మామిండ్ల పెద్ద అయిలయ్య, చిన్న అయిలయ్య, ఓదెల రవి, కనకం సాల్మన్, కనకం బాబు, బొమ్మకంటి అనిల్, సాగర్, జన్ను సుదర్శన్, కొండి సదానందం, కొచ్చర్ల సదయ్య, అల్లె సుభాష్, కత్తి సమ్మయ్య, బండి కోటి, పప్పు విజయ్, వక్కల బాబు, గూడెపు బాబు, గుండెబోయిన ఐలయ్య, కనకం రాధ, దుప్పల్లి లక్ష్మి, కనకం స్వప్న, పల్లె రవి తదితరులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రికి ఘనంగా ఏర్పాట్లు





**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన భీమేశ్వర స్వామి ఆలయంలో జరగనున్న మహాశివరాత్రి జాతరకు ఘనంగా ఏర్పాట్లు చేపడుతున్నారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశమున్న నేపథ్యంలో ఆలయ అధికారులు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ పార్కింగ్ ప్రదేశంలో ప్రత్యేకంగా విద్యుత్ దీపాల అలంకరణలు, భారీ గేట్లు ఏర్పాటు చేయడంతో పాటు వాహనాలను సక్రమంగా నిలిపేందుకు ప్రత్యేక పార్కింగ్ సదుపాయం కల్పించారు. అలాగే శివార్చన కార్యక్రమాల కోసం ప్రత్యేక వేదికను (స్టేజ్) ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చలువ పందిళ్లు, తాగునీటి సదుపాయం, స్వామి–అమ్మవార్లకు రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణలు ఏర్పాటు చేస్తున్నారు. అదనంగా పారిశుభ్రత చర్యలు చేపట్టడంతో పాటు తాత్కాలిక మరుగుదొడ్లు (టాయిలెట్లు), సీసీ రోడ్ల సదుపాయం వంటి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. మహాశివరాత్రి సందర్భంగా వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని విభాగాలతో సమన్వయం చేసుకుంటూ సమగ్ర ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ అధికారులు తెలిపారు.

# ఫర్టిలైజర్ దుకాణంలో ఏవో తనిఖీలు




**వేద న్యూస్, కారేపల్లి:**

కారేపల్లి మండలంలోని భజ్యతండాలో ఉన్న రైతు ఆగ్రో సేవా కేంద్రం ఫర్టిలైజర్ దుకాణాన్ని వ్యవసాయ అధికారి (ఏవో) భట్టు అశోక్ కుమార్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా రూపొందించిన ఎఫ్ఐఈవీఎస్ యాప్ ద్వారా ఎరువుల నిల్వలు, అమ్మకాలు మరియు ఇతర వివరాలను పరిశీలించారు. ఈ యాప్ ద్వారా డీలర్లకు సంబంధించిన పూర్తి సమాచారం వ్యవసాయ శాఖ వద్ద అందుబాటులో ఉంటుందని, డీలర్లు ఎటువంటి పొరపాట్లు చేసినా వెంటనే గుర్తించగలమని తెలిపారు. ఎరువుల విక్రయంలో అవకతవకలు లేదా నిబంధనల ఉల్లంఘనలు జరిగితే సంబంధిత డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో హెచ్చరించారు. ఈ తనిఖీలలో ఆయనతో పాటు ఏఈవో ఎస్కే మున్ని పాల్గొన్నారు.

# అందుబాటులో ఉండరు.. సమస్యలను పట్టించుకోరు..

- సర్పంచ్, సెక్రటరీపై గ్రామస్తుల ఆగ్రహం



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండలంలోని సులేమాన్‌నగర్ గ్రామపంచాయతీ కార్యాలయం లో సర్పంచ్ అఫ్రిన్ బేగం ఎప్పుడూ అందుబాటులో ఉండడం లేదని, గ్రామంలోని వార్డుల్లో సమస్యలు తీవ్రమవుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదని వార్డు సభ్యులు సర్పంచ్, సెక్రటరీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద వార్డు సభ్యులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, మురుగు కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి అధ్వానంగా మారాయని తెలిపారు. అలాగే రాయకూర్ గ్రామానికి వెళ్లే రహదారి పక్కన ఉన్న పల్లె ప్రకృతి వనం కబ్జాకు గురైందని, ఆ స్థలంలో గేదెలను కట్టివేయడంతో పాటు ఇటుక దంపులు వేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై సెక్రటరీకి ఫిర్యాదు చేసి 15 రోజులు గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. వార్డుల్లో ఉన్న సమస్యల గురించి సెక్రటరీకి చెప్పినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవపహరిస్తున్నారని పేర్కొన్నారు. సర్పంచ్‌కు ఫోన్ చేయమని కోరితే, మాజీ సర్పంచ్‌కు సమాచారం ఇస్తున్నాడని, సర్పంచ్ ఫోన్ నెంబర్ అడిగితే తనకు తెలియదని చెప్పడం ఆశ్చర్యకరమని విమర్శించారు. అధికారులు వెంటనే స్పందించి గ్రామ సర్పంచ్, సెక్రటరీపై తగిన చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అయాస్, షఫీ, విజయ్, రఫిక్, జావీద్ తదితర వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ నిర్మాణానికి 'వైర్ల' అడ్డంకి

- చీమలపాడు విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా స్పందించని ఏఈ, సబ్ ఇంజనీర్
- కారేపల్లి మండలం గాదెపాడులో నిలిచిపోయిన ఇంటి నిర్మాణం



**వేద న్యూస్, కారేపల్లి:**

ప్రభుత్వం పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నప్పటికీ, విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఓ లబ్ధిదారుడి ఇంటి నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. కారేపల్లి మండలం గాదెపాడు గ్రామానికి చెందిన భూక్య గోవర్ధన్‌కు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. అయితే ఇంటి పైభాగం మీదుగా 33/11 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్లు వెళ్తుండటంతో ఇంటి స్లాబ్ వేయడం సాధ్యంకావడం లేదు.

**పట్టించుకోని విద్యుత్ అధికారులు**

విద్యుత్ వైర్ల వల్ల ప్రాణాపాయం పొంచి ఉండటంతో, వాటిని తొలగించాలని లేదా మార్పులు చేయాలని బాధితుడు గోవర్ధన్ గత కొద్ది రోజులుగా విద్యుత్ అధికారుల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా స్పందన లభించలేదు. గాదెపాడు సర్పంచ్ రంజిత్ స్వయంగా జోక్యం చేసుకుని సమస్య తీవ్రతను చీమలపాడు విద్యుత్ శాఖ ఏఈ, సబ్ ఇంజనీర్లకు వివరించారు. ఇంటి నిర్మాణం పూర్తి చేయాలంటే వైర్లను తొలగించడం లేదా ఎత్తు పెంచడం తప్పనిసరి అయినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

**బాధితుడి ఆవేదన**

ప్రభుత్వం ఇల్లు కట్టుకోమని ఆర్థిక సహాయం అందిస్తుంటే, విద్యుత్ వైర్ల కారణంగా పనులు నిలిచిపోయాయి. అధికారులు స్పందించకపోతే నా ఇల్లు మధ్యలోనే ఆగిపోయే పరిస్థితి ఉంది. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది? అని బాధితుడు గోవర్ధన్ ఆవేదన వ్యక్తం చేశారు. తన కాలు విరిగి సంవత్సరం అయినందున అధికారుల కార్యాలయాల చుట్టూ తిరగడం కూడా కష్టంగా మారిందని తెలిపారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, విద్యుత్ లైన్లను మార్చాలని లేదా ఎత్తు పెంచి ఇంటి నిర్మాణానికి సహకరించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే విద్యుత్ కార్యాలయం ముందు ధర్నా చేపడతామని హెచ్చరిస్తున్నారు. వేద న్యూస్ కథనానికి సంబం ధిత అధికారులు స్పందిస్తారా లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది.

# ఆయిల్ పామ్ సాగుతో నికర ఆదాయం

- ఫీల్డ్ ఆఫీసర్ శ్రీకాంత్



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతులు మంచి నికర ఆదాయం పొందవచ్చని ఫీల్డ్ ఆఫీసర్ శ్రీకాంత్ తెలిపారు. బుధవారం బోయినిపల్లి మండలం కొదురుపాక గ్రామం లోని ఆయిల్ పామ్ తోటలను సందర్శించి గెలల కోత ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందని తెలిపారు. రైతులకు ఒక్కో మొక్కను కేవలం రూ. 20కే అందిస్తున్నట్లు చెప్పారు. సరైన నిర్వహణతో ఎకరానికి సంవత్సరానికి సుమారు రూ. 1,50,000 వరకు నికర ఆదాయం పొందే అవకాశం ఉందని వివరించారు. ఆయిల్ పామ్ సాగు ద్వారా దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయం పొందవచ్చని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7396667096 నంబరల్లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

# మిడ్ మానేర్ ముంపు గ్రామాల ఆవేదన

- నెరవేరని హామీలపై ప్రజల ఆందోళన





**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని మిడ్ మానేర్ ప్రాజెక్ట్ ముంపుకు గురైన కోదురుపాక, నీలోజిపల్లి గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముంపు కారణంగా తమ ఇళ్లు, వ్యవసాయ భూములు, జీవనాధారాలను కోల్పోయిన బాధితులు ఇప్పటికీ పూర్తిస్థాయి పునరావాసం, హామీలు అందక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముంపు బాధితులకు రూ. 5,04,000 పరిహారం, అలాగే 18 సంవత్సరాలు నిండిన యువతకు రెండు గుంటల భూమి, రూ. 2,04,000 ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ హామీలపై నమ్మకంతో రెండు సార్లు అప్లికేషన్లు సమర్పించినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి నెలకొంది. ఎన్నికల సమయంలో మాత్రమే నాయకులు హామీలు ఇస్తున్నారని, కానీ అమలు లో మాత్రం ఆలస్యం జరుగుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ముంపు గ్రామాల ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి, తగిన పునరావాసం కల్పించాలని బాధితులు కోరుతున్నారు.

# రుద్రూర్‌లో కాంగ్రెస్ పార్టీ విలేకరుల సమావేశం



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తోట అరుణ్ కుమార్, దిశా కమిటీ సభ్యుడు నడిపింటి నగేష్ మాట్లాడుతూ, బాన్సువాడలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రశేఖర్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేయడం తగదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇటువంటి చర్యలు పార్టీకి నష్టం కలిగిస్తాయని, పార్టీ క్రమశిక్షణను పాటించాల్సిన బాధ్యత ప్రతి నాయకుడిపై ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్కపల్లి నాగేందర్, తోట సంగయ్య, నేరుగంటి బాలరాజ్, వార్డు సభ్యుడు ఇమ్రాన్, కొండల్వాడి శంకర్, షేక్ ఖాదర్, సంతోష్ తదితర కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

వేద న్యూస్

శుక్రవారం ఫిబ్రవరి 13, 2026

# బస్టాండ్ లేక అవస్థలు

- మంత్రి పొంగులేటి ఇలాకాలో ప్రజల ఇబ్బందులు
- రోడ్లపైనే నిత్యం వందల మంది ప్రయాణికులు




**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం చారిత్రక ప్రాధాన్యం కలిగిన ప్రాంతంగా గుర్తింపు పొందింది. భక్త రామదాసు జన్మస్థలంగా ప్రసిద్ధి చెందిన ఈ ప్రాంతంలో, దక్షిణ భారతదేశంలో రెండో అతిపెద్ద బౌద్ధ స్తూపం కూడా ఉంది. అయితే ఇంతటి చారిత్రక ప్రాధాన్యం ఉన్న నేలకొండపల్లి మండల కేంద్రంలో ఇప్పటికీ బస్టాండ్ లేకపోవడం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ప్రస్తుతం ఖమ్మం, కోదాడ తదితర ప్రాంతాలకు వెళ్లే వందలాది మంది ప్రయాణికులు ప్రతిరోజూ రోడ్లపైనే నిలబడి బస్సుల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. ఎండ, వానలను లెక్కచేయకుండా రోడ్లపై నిలబడే



పరిస్థితి నెలకొనడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సొంత నియోజకవర్గమైన పాలేరు పరిధిలో ఉన్న నేలకొండపల్లి మండల కేంద్రంలో ఈ సమస్యను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే అసంతృప్తి ప్రజల్లో వ్యక్తమవుతోంది. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు ఈ సమస్యను మంత్రి దృష్టికి తీసుకువెళ్లడంలో విఫలమయ్యారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో రోడ్ల అభివృద్ధి పనులు, సెంట్రల్ డివైడర్ నిర్మాణం చేపట్టినా, నేలకొండపల్లి రింగ్ సెంటర్ నుంచి కూసుమంచి రోడ్డు జాతీయ రహదారి వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ సమస్యలను పలుమార్లు పత్రికల్లో ప్రస్తావించినప్పటికీ స్పందన లేకపోవడం బాధాకరమని స్థానికులు పేర్కొంటున్నారు.

**తక్షణమే బస్టాండ్ నిర్మించాలి: సీపీఐ నాయకుడు**

నేలకొండపల్లి మండల కేంద్రంలో బస్టాండ్ లేక ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెంటనే స్పందించి బస్టాండ్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. అలాగే నేలకొండపల్లి సెంటర్ నుంచి కూసుమంచి రోడ్డు జాతీయ రహదారి వరకు సెంట్రల్ లైటింగ్ పెండింగ్ పనులను కూడా వెంటనే పూర్తి చేయాలని ఆయన కోరారు.

# నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలి

- కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలి
  జేఏసీ నాయకులు




**వేద న్యూస్, జ్యోతినగర్ :**

దేశవ్యాప్తంగా పిలుపునిచ్చిన సార్వత్రిక సమ్మెలో భాగంగా ఎన్టీపీసీ రామగుండంలోని కాంట్రాక్టు కార్మికులు బుధవారం షిఫ్ట్ నుంచే సమ్మెలోకి దిగారు. ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె పూర్తిస్థాయిలో నిర్వహించారు. సమ్మె సందర్భంగా ఎన్టీపీసీ గేట్ నెంబర్2 నుండి మేడిపల్లి సెంటర్ వరకు సుమారు 500 మంది కార్మికులతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్మికులు నినాదాలతో తమ డిమాండ్లను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కనీస వేతనాన్ని రూ.26,000గా నిర్ణయించాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని, ఎల్ఐసీలో 100 శాతం ఎఫ్‌డీఐ అనుమతులను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. అదనంగా శ్రమ శక్తి నీతి- 2025ను రద్దు చేయాలని, కనీస పెన్షన్‌ను రూ.9,000గా అమలు చేయాలని, విద్యుత్ సవరణ చట్టం-2025ను వెనక్కి తీసుకోవాలని, జాతీయ విత్తన బిల్లు-2025ను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీలో భాగస్వాములైన ఐఎన్టీయూసీ నుంచి భూమల చందర్, జమీల్ , ఏఐటీయూసీ నుంచి ఆర్. లక్ష్మణ్, సిఐటీయూ నుంచి ఎండీ యాకుబ్, గీట్ల లక్ష్మారెడ్డి, దండ రాఘవరెడ్డి, ఐఎఫ్టీయూ నుంచి చిలుక శంకర్, గుండు రాజయ్య; గోదావరి యూనియన్ నుంచి కౌశిక్ హరి, ఆ రాజమల్లు హెచ్ఎఫ్ మెస్ నుంచి సిహెచ్ ఉపేందర్ టీయూసీఐ నుంచి రాజేందర్ నాగభూషణం టీఎన్టీయూసీ నుంచి దామోదర్ రెడ్డి, శ్రీనివాస్ బీఆర్‌టీయూ నుంచి ఇజ్జగిరి భూమయ్య కెపీకేఎంఎస్ నుంచి చింతల సత్యం తదితరులు పాల్గొన్నారు. అలాగే నాయకులు కాదాసి మల్లేష్, కుందార రాజ్‌కుమార్, ఆడపు రమేష్, టి. రవీందర్ తదితరులు హాజరయ్యారు.

# ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద ఆంక్షలు

- మద్యం దుకాణాలు మూసివేత
- ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

మున్సిపాలిటీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ కోసం కౌంటింగ్ కేంద్రాల వద్ద ఆంక్షలు విధిస్తూ పోలీస్ కమిషనర్ సునీల్ దత్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆంక్షలు ఈ నెల 13వ తేదీ ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు అమల్లో ఉంటాయని తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా కమిషనరేట్ పరిధిలో సెక్షన్ 163 (బీఎన్ఎస్ఎస్) అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద కర్రలు, లాఠీలు, ఆయుధాలు, పేలుడు పదార్థాలు తీసుకురావడం నిషేధించారు. అలాగే మైక్‌లు, మ్యూజిక్ సిస్టమ్‌లు, ప్లకార్డులు, ర్యాలీలు, ధర్నాలు, బహిరంగ సభలు నిర్వహించడం, ఐదుగురికిపైగా గుమికూడడం నిషేధమని స్పష్టం చేశారు. విజయోత్సవ ర్యాలీలు, డీజేలు, టపాసులు కాల్చడంపై కూడా నిషేధం విధించినట్లు తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసు, మిలటరీ, ఎన్నికల అధికారులకు ఈ ఆంక్షల నుంచి మినహాయింపు ఉంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా ఓట్ల లెక్కింపు సందర్భంగా ఖమ్మం జిల్లా పరిధిలోని ఏదులాపురం, మధిర, వైరా, సత్తుపల్లి, కల్లూరు మున్సిపాలిటీ కౌంటింగ్ కేంద్రాల పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి



లెక్కింపు పూర్తయ్యే వరకు వైన్ షాపులు, బార్లు, మద్యం సరఫరా చేసే రెస్టారెంట్లు మూసివేయాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన కమిషనర్, కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు.

# అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల ర్యాలీ

- ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వరకు నిరసన

**వేద న్యూస్, మెట్‌పల్లి:**

దేశవ్యాప్త సమ్మెలో భాగంగా తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో గురువారం అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో సమావేశమైన అంగన్వాడీ సిబ్బంది, అక్కడి నుంచి బస్సు డిపో వరకు, అనంతరం ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. తమ సమస్యల పరిష్కారం కోసం పారిశ్రామిక వివాదాల చట్టం-1947 సెక్షన్ 22 ప్రకారం సమ్మె నోటీసులు ఇస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ. 26,000 చెల్లించాలని, పదవీ విరమణ చేసిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే అర్హులైన



వారికి సూపర్వైజర్లుగా పదోన్నతులు ఇవ్వాలని, గతంలో నిర్వహించిన సమ్మె కాలానికి సంబంధించిన వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ ర్యాలీలో అంగన్వాడీ సిబ్బందితో పాటు మధ్యాహ్న భోజన సిబ్బంది, గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్మికులు కూడా పాల్గొన్నారు.

# లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి




- బోయినపల్లిలో కార్మికుల డిమాండ్

**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని భావిస్తున్న 4 లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా కార్మికులు ఎన్నో సంవత్సరాల పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం కొత్త లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని విమర్శించారు. ఈ కోడ్‌ల అమలు వల్ల కార్మికుల హక్కులు దెబ్బతింటాయని, పని భద్రత, వేతనాలు, సంక్షేమం వంటి అంశాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల పని సమయాన్ని రోజుకు 8 గంటలుగానే కొనసాగించాలని, సంఘటిత మరియు అసంఘటిత కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులకు ప్రమాద బీమా, ఆరోగ్య భద్రత, ఉపాధి భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీఐటీయూ సహాయ కార్యదర్శి గురిజాల శ్రీధర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామంచ అశోక్ తదితర నాయకులు మరియు వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

# ఇసుక ట్రాక్టర్ల అతివేగం..

- మూగజీవుల ప్రాణాలు బలి



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామ పరిధిలో ఇసుక ట్రాక్టర్ల అతివేగం కారణంగా మూగజీవుల ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు పెరుగుతున్నాయి. వేగంగా దూసుకెళ్తున్న ట్రాక్టర్లు పశువులను ఢీకొట్టడంతో అవి అక్కడికక్కడే మృతి చెందుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో నియంత్రణ లేకుండా అతివేగంగా సంచరిస్తున్న ఇసుక ట్రాక్టర్ల వల్ల మూగజీవులతో పాటు గ్రామస్తుల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడుతోందని స్థానికులు తెలిపారు. ఇసుక రవాణా చేసే వాహనాలు వేగ పరిమితులను పాటించకపోవడం, సంబంధిత అధికారులు పర్యవేక్షణ లోపించడం ఈ పరిస్థితికి కారణమని ఆరోపించారు. ఇసుక రవాణాపై తక్షణమే నియంత్రణ విధించి, అతివేగంగా నడిపే ట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు పోలీస్, రెవెన్యూ అధికారులను కోరుతున్నారు. లేనిపక్షంలో మరిన్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# బేకరీ ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని

**వేద న్యూస్, హనుమకొండ:**



హనుమకొండ నగరం గోపాల్‌పూర్ క్రాస్ రోడ్ సమీపంలో వస్కుల శైలజ-శ్రీధర్ దంపతులు ఏర్పాటు చేసిన ఎస్ఎస్ లుడ్వినా -లువినా కేక్స్ అండ్ బేకరీను వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బేకరీ వద్దకు చేరుకున్న ఎమ్మెల్యేకు నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి బేకరీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, నిర్వాహకుల కుటుంబ సభ్యులు, మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# పేరుకే పెద్ద మండలం..

- డిప్యూటీ తహసీల్దార్ లేక ప్రజల ఇబ్బందులు
- పంచాయతీ ఆపరేటర్ల విధుల బహిష్కరణతో నిలిచిపోయిన సేవలు

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ లేకపోవడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్న చిన్న ధృవ పత్రాలు పొందడానికి కూడా ప్రజలు నెలల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోనే ఎక్కువ గ్రామాలు ఉన్న మండలంగా ఉన్నప్పటికీ డిప్యూటీ తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉండటం సమస్యలను మరింత పెంచుతోంది. అదేవిధంగా పంచాయతీ ఆపరేటర్లు విధులు బహిష్కరించడంతో గ్రామపంచాయతీల్లో సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. పంచాయతీ నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ వాటిని వినియోగించలేని పరిస్థితి నెలకొంది. ఇతర మండలాల్లో అధికారులు సమన్వయం చేసి ఆపరేటర్లను విధుల్లోకి తీసుకువచ్చినా, ఇల్లంతకుంట మండలంలో మాత్రం సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. పంచాయతీ ఆపరేటర్ల లేకపోవడంతో ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు అందడం లేదని, అభివృద్ధి పనులు కూడా నిలిచిపోయాయని పేర్కొన్నారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఇల్లంతకుంట మండలానికి డిప్యూటీ తహసీల్దార్‌ను నియమించడంతో పాటు పంచాయతీ ఆపరేటర్ల సమస్యను పరిష్కరించాలని పొత్తూరు సర్పంచ్ పట్నం అశ్విని కోరారు.

# మహా శివరాత్రి జాతర విజయవంతం చేయాలి

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- తుది ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశం



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

మహాశివరాత్రి జాతరను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో నిర్వహించి విజయవంతం చేయాలని ఇంచార్జి కలెక్టర్, మహాశివరాత్రి జాతర కమిటీ చైర్‌పర్సన్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఈ నెల 14, 15, 16 తేదీల్లో జరగనున్న జాతర ఏర్పాట్లపై గురువారం జిల్లా సమీకృత కార్యా లయాల సముదాయం నుంచి వివిధ శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భీమేశ్వర ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శన ఏర్పాట్లు చేయాలని, భక్తుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆలయ పరిసరాలు, పార్కింగ్ స్థలాలు, క్యూ లైన్ల వద్ద పారిశుధ్యం, తాగునీటి సదుపాయం, హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, వైద్య బృందాలు, అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచాలని, ఫైర్ సేఫ్టీ పరికరాలు తనిఖీ చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. భక్తులకు అందించే ఆహార పదార్థాలను ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చేయాలని తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులకు వీల్‌చైర్లు అందుబాటులో ఉంచాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని, జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని స్పష్టం చేశారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో ఎస్పీ మహేష్ బి. గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీవోలు, ఆలయ ఈఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ కార్మికుల గర్జన

- విద్యుత్ సవరణ బిల్లు-2025 రద్దు చేయాలి
- రాష్ట్ర అధ్యక్షుడు కె. ఈశ్వర్



**వేద న్యూస్, కోనరావుపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రంలో విద్యుత్ కార్మికులు భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కర్నాల అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె. ఈశ్వర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సవరణ బిల్లు-2025ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేయడం వల్ల సామాన్య ప్రజలపై భారంతో పాటు కార్మికుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే కార్మికులకు నష్టం కలిగించే 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, నిలిపివేసిన ఎఫ్‌టీఏను పునరుద్ధరించాలని కోరారు. ఐటీఐ చదివిన కార్మికులను అసిస్టెంట్ హెల్పర్లుగా కాకుండా జేఎల్ఎమ్‌లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు మాట్లాడుతూ, సెస్ కార్మికులకు పదోన్నతులు కల్పించాలని, విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న వార్షిక గ్రేడ్ ఇంక్రిమెంట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, ఐద్వా జిల్లా కార్యదర్శి విమల, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేశం, ఆశా వర్కర్ల సంఘం ప్రతినిధులు, గ్రామపంచాయతీ, హమాలీ, మధ్యాహ్న భోజన పథక కార్మికులు మరియు పెద్ద సంఖ్యలో విద్యుత్ కార్మికులు పాల్గొన్నారు.

# టీబీ బాధితులకు ఉచిత న్యూట్రిషన్ కిట్ల పంపిణీ



**వేద న్యూస్, హనుమకొండ:**

హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ భవన్‌లో గురువారం రోజున రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో 30 మంది టీబీ (క్షయ) వ్యాధిగ్రస్తులకు ఉచిత న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేయబడినాయి. ఈ కిట్లను రెడ్ క్రాస్ సొసైటీ పాలకవర్గ సభ్యుల చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్లో భాగంగా హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ తరపున 30 మంది బాధితులకు ఉచిత న్యూట్రిషన్ కిట్లు ఇనగాల చారిటబుల్ ట్రస్ట్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, డా. రాకేష్ వాసవి రెడ్డి, డా. వంగ హేమంత్ రెడ్డి సహకారంతో జులై నెల నుంచి ఆరు నెలల పాటు ప్రతి నెలా 30 మందికి న్యూట్రిషన్ కిట్లు పంపిణీ ఇప్పటివరకు 6 నెలలు పూర్తీ అయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ డా. పి. విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు: ఈ.వి. శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు: పుల్లూరి వేణుగోపాల్, టిబి బాధితులు, టిబి విభాగం సిబ్బంది మరియు రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

# శివరాత్రి బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు



- భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు
- సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత

**వేద న్యూస్, మడికొండ:**

వరంగల్ మహానగరంలో దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి దేవస్థానం మెట్టుగుట్టపై నేటి నుంచి 21 వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత తెలిపారు. గురువారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భద్రత, ట్రాఫిక్, పారిశుధ్యం, తాగునీటి వంటి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సత్యనారాయణ మాట్లాడుతూ.. సామాన్య భక్తుల సౌకర్యార్థం గర్భాలయంలో నిర్వహించే ఆర్జిత అభిషేకాలను రద్దు చేసి, అభిషేక మండపంలో సామూహిక అభిషేకాలను కొనసాగిస్తామని తెలిపారు. దాతలకు కేటాయించిన సమయాల్లో దర్శనం కల్పించనున్నట్లు చెప్పారు. క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు తాగునీరు, మజ్జిగ, అన్నప్రసాదం, అల్పాహారం వంటి సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, మడికొండ సీఐ కిషన్, ఆలయ చైర్మన్ పైడిపాల రఘుచందర్, ధర్మకర్తలు, అర్చకులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వెస్లీ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్ పరిశీలన

- భద్రతా ఏర్పాట్లపై సమీక్షించిన అదనపు ఎస్పీ మహేందర్



**వేద న్యూస్, మెదక్:**

మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని వెస్లీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్‌ను మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ పరిశీలించారు. శుక్రవారం జరగనున్న ఓట్ల లెక్కింపు నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను ఆయన ప్రత్యక్షంగా సమీక్షించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద మూడు స్థాయిల భద్రత, సీసీ కెమెరాల పర్యవేక్షణ, ప్రవేశ, నిష్క్రమణ ద్వారాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. అనుమతి లేని వ్యక్తులు స్ట్రాంగ్ రూమ్ వద్దకు రాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ సెంటర్‌లోకి మొబైల్ ఫోన్లు తీసుకురావడం నిషేధమని, అభ్యర్థులు, వారి ఏజెంట్లు పోలీసుల సూచనల మేరకు మాత్రమే వాహనాలను పార్క్ చేయాలని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున విజయోత్సవ ర్యాలీలు, అనుమతి లేని సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా, ఎన్నికల నియమావళి ప్రకారం సజావుగా సాగేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, టౌన్ సీఐ మహేష్, ఆర్ఎస్ఐ మహిపాల్, ఎస్ఐ శిరీష తదితరులు పాల్గొన్నారు.

# టేక్మాల్‌లో కార్మికుల సార్వత్రిక సమ్మె

- సమస్యలు పరిష్కరించాలని కార్మికుల డిమాండ్



**వేద న్యూస్, టేక్మాల్:**

దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు ఇచ్చిన సార్వత్రిక సమ్మె పిలుపులో భాగంగా టేక్మాల్ మండలంలో సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ. 26,000 చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. అలాగే మల్టీపర్పస్ వర్కర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ఈఎస్ఐ, ఈపీఎఫ్, ప్రమాద బీమా వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చింత సదానందం, దమ్మిగారి అశోక్, తుడుము లక్ష్మయ్య, రామని యాదమ్మ, రాముని సత్తెమ్మ, ఎర్రోళ్ల దుర్గమ్మ, చింత దుర్గమ్మ తదితర కార్మికులు పాల్గొన్నారు.

# పాఠశాలల అంతర్గత మార్కుల పరిశీలన



**వేద న్యూస్, మరిపెడ:**

మరిపెడ మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల అంతర్గత మార్కులను పరిశీలన బృందం తనిఖీ చేసింది. ఈ బృందంలో గెజిటెడ్ హెడ్ మాస్టర్ అనంతరావు, ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు బయగాని రామ్మోహన్, గణిత ఉపాధ్యాయుడు రమేష్ రెడ్డి పాల్గొన్నారు. గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తానంచర్ల, గుండెపూడి, సెంట్ ఆగస్టిన్, వీరారం, భారతి విద్యామందిర్ పాఠశాలల్లో అంతర్గత మార్కుల పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల మార్కుల నమోదు విధానాన్ని పరిశీలించి, ఉపాధ్యాయులకు తగిన సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దేవేందర్, సరోజ, దీనా, మధు, శ్రీధర్ రెడ్డి మరియు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కొండాపూర్‌లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం

- కబ్జాలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండలం కొండాపూర్ గ్రామంలో ప్రభుత్వ భూములు, చెరువులు, పత్తరకుంటలు అన్యాక్రాంతమవుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వే నెంబర్ 219లో ఉన్న ఊర చెరువు మొత్తం 42 ఎకరాల 18 గుంటల విస్తీర్ణం కలిగి ఉండగా, అందులో సుమారు 12 ఎకరాలు కబ్జాలకు గురైందని స్థానికులు ఆరో పిస్తున్నారు. అలాగే సర్వే నెంబర్ 103లో ఉన్న పత్తరకుంట 28 ఎకరాల 15 గుంటల భూమి పూర్తిగా కబ్జాదారుల చేతిలోకి వెళ్లి, కుంట ఆనవాళ్లు కూడా లేకుండా పోయాయని ఆరోపించారు. అదనంగా సర్వే నెంబర్లు 141, 142, 143లో సుమారు 4 ఎకరాల గుట్ట భూమి, సర్వే నెంబర్ 309లో పేదలకు పంపిణీ చేసిన 12 ఎకరాల భూమి కూడా కబ్జాలకు గురైందని పేర్కొన్నారు. ఈ విషయంపై పలుమార్లు రెవెన్యూ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ, విచారణ పేరుతో కాలయాపన జరుగుతోందే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. చెరువు భూములు కబ్జాకు గురవడంతో గ్రామం లో అంత్యక్రియలు నిర్వహిం చేందుకు కూడా స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అన్యా క్రాంతమైన భూములను స్వాధీనం చేసుకుని గ్రామస్తులకు న్యాయం చేయాల ని వారు డిమాండ్ చేశారు.



# బాల్య వివాహాలను అరికట్టాలి



- తహసీల్దార్ ప్రవీణ్ కుమార్

**వేద న్యూస్, శాయంపేట**

బాల్య వివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని శాయంపేట తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, షేర్ ఎన్జీవో ఆధ్వర్యంలో నిర్వహించిన బాల్య వివాహాల నిర్మూలన చైతన్య రథాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. బాల్య వివాహాలు బాలికల శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం చూపుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ జి. ప్రభావతి, సీనియర్ అసిస్టెంట్ అచ్చారావు, కొప్పుల జీపీఓ వంగిటి సత్యం, జూనియర్ అసిస్టెంట్ పి. రాజు మరియు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు

# కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

**– జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**

**వేద న్యూస్, మంచిర్యాల:**



మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఈ నెల 13న జరగనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ముల్కల్లలోని ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో, బెల్లంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, చెన్నూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, క్యాతనపల్లి ఆర్‌కేసీఓఏ క్లబ్‌లో, లక్షెట్టిపేట పాత ఎంపీడీఓ కార్యాలయంలో కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ కోసం మంచిర్యాల కార్పొరేషన్‌కు 66 మంది సూపర్వైజర్లు, 132 మంది సహాయకులు, బెల్లంపల్లికి 19 మంది సూపర్వైజర్లు, 37 మంది సహాయకులు, చెన్నూర్‌కు 10 మంది సూపర్వైజర్లు, 20 మంది సహాయకులు, క్యాతనపల్లికి 24 మంది సూపర్వైజర్లు, 48 మంది సహాయకులు, లక్షెట్టిపేటకు 9 మంది సూపర్వైజర్లు, 18 మంది సహాయకులను నియమించినట్లు తెలిపారు. వార్డుల సంఖ్యకు అనుగుణంగా కౌంటింగ్ టేబుళ్లు ఏర్పాటు చేసి, రౌండ్ల వారీగా ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు.

# యువత క్రీడల్లో జాతీయ స్థాయికి ఎదగాలి

**– ఆటలు క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తిని పెంచుతాయి**
**– ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య**
**– తొడితలగూడెం ప్రీమియర్ లీగ్ విజేతలకు బహుమతుల ప్రదానం**

**వేద న్యూస్, కారేపల్లి:**



యువత క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పిలుపునిచ్చారు. సింగరేణి మండల పరిధిలోని తొడితలగూడెం గ్రామంలో నిర్వహించిన తొడితలగూడెం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాలుగు మండలాల జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో కారేపల్లి జట్టు ప్రథమ స్థానం సాధించగా, తొడితలగూడెం జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేతలకు ఎమ్మెల్యే స్వయంగా బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడలు యువతలో క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయని, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి టోర్నమెంట్‌లు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బానోత్ ప్రియంక, మాజీ ఎంపీటీసీ ఉమా శంకర్, స్థానిక ప్రజాప్రతినిధులు, యువత మరియు క్రీడాభిమానులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు జీపీ కార్మికుల మద్దతు

**వేద న్యూస్, శాయంపేట:**



దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు మద్దతుగా శాయంపేట మండలంలోని గ్రామపంచాయతీ కార్మికులు అంబేద్కర్ బస్టాండ్ సెంటర్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర కార్యదర్శి, బీసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి తెలంగాణ కొమురయ్య, బహుజన సంఘ జిల్లా అధ్యక్షుడు మారపెల్లి క్రాంతి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని కోరారు. అలాగే కార్మికులకు కనీస వేతనం రూ. 26,000గా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు అక్కినేపల్లి యాకయ్య, మారపెల్లి సూర్యం, దైనంపెల్లి చిత్తం, కొత్తపెల్లి రాజన్న, రాజు, విమల, లక్ష్మి, పుష్ప, ఎలిసా, సరోజన, పద్మ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# గాదెపాడులో తొలగిన విద్యుత్ ముప్పు

**– ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కల తొలగింపు**
**– 'వేద న్యూస్' కథనానికి స్పందన**

**వేద న్యూస్, కారేపల్లి:**



గాదెపాడు గ్రామంలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమస్యపై 'వేద న్యూస్' ప్రచురించిన కథనానికి అధికారులు వెంటనే స్పందించారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన రేగు పొదలు, పిచ్చిమొక్కలు విద్యుత్ ప్రమాదానికి కారణమవుతున్నాయని వార్తలో ప్రస్తావించగా, విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. వార్త ప్రచురితమైన మరుసటి రోజే సిబ్బందిని పంపి ట్రాన్స్‌ఫార్మర్ పరిసరాల్లో ఉన్న పొదలను పూర్తిగా తొలగించి శుభ్రపరిచారు. దీంతో గ్రామంలో నెలకొన్న ప్రమాదం తొలగి ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. సమస్యను వెలుగులోకి తీసుకు వచ్చిన 'వేద న్యూస్'కు, వెంటనే స్పందించిన విద్యుత్ శాఖ అధికారులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



వేద న్యూస్
2026-02-12
https://epaper.vedhanews.in/

**గాదెపాడులో పొంచి ఉన్న విద్యుత్ ప్రమాదం**

**– ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రేగమండల దిగ్బంధం**

**వేద న్యూస్, సింగరేణి:**

సింగరేణి మండల పరిధిలోని గాదెపాడు గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ భారీగా పెరిగిన చెత్తాచెదారం, ఎండిన రేగమండలు (ముళ్ల పొదలు) స్థానికులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ప్రమాదం పొంచి ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగిస్తూ శుభ్రత నిర్వహించాలి. అయితే గాదెపాడులో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఎండిన పొదలు అలుముకోవడంతో ఎప్పుడైనా షార్ట్ సర్క్యూట్ జరిగితే మంటలు వ్యాపించే ప్రమాదం ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. చెత్తాచెదారం కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ స్పష్టంగా కనిపించని పరిస్థితి నెలకొనడంతో అటుగా వెళ్లే చిన్నారులు, పశువులకు ప్రాణాపాయం ఉన్నట్లు వారు పేర్కొన్నారు. పలుమార్లు అధికారులకు సమాచారం అందించినప్పటికీ స్పందన లేకపోవడం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ పరిసర ప్రాంతాన్ని శుభ్రపరిచి, రక్షణ కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# కాలువ పనులను వెంటనే పూర్తి చేయాలి

**– రైతుల రిలే నిరాహార దీక్ష**
**– మద్దతు బీజేపీ మండల అధ్యక్షుడు**

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పెద్ద లింగాపూర్ గ్రామంలో రంగనాయక సాగర్ 11/6 కాలువ అసంపూర్తి పనులను వెంటనే పూర్తి చేయాలని రైతులు చేపట్టిన మూడో రోజు రిలే నిరాహార దీక్షకు బీజేపీ మండల అధ్యక్షుడు భూమల్ల అనిల్ కుమార్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత మరియు ప్రస్తుత ప్రభుత్వాలు కాలువ పనులను పూర్తి చేయడంలో విఫలమయ్యాయని విమర్శించారు. కాలువ పనులు పూర్తయితే సుమారు 10 వేల ఎకరాల భూమి సాగులోకి వస్తుందని, రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కాలువ నీరు వస్తుందనే ఆశతో రైతులు పంటలు సాగు చేశారని, నీటి కొరత వల్ల పంటలు ఎండిపోకుండా ప్రభుత్వం తాత్కాలిక పంపింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కాలువ పనులు ఆలస్యమవడంతో నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు కరికె నవీన్, గాదె మధుసూదన్, పయ్యావుల బాలయ్య, పలుమారు రవి, కంటము రవి, రాజిరెడ్డి, ఎల్లం, శ్రీనివాస్, మల్లేశం మరియు బీజేపీ నాయకులు కుడుముల శ్రీహరి, మారవేణి రాజు, తుమ్మలపల్లి కమలాకర్ రావు, దాసరి యాదగిరి, బర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## శ్యాంసుందర్ రెడ్డి జ్ఞాపకార్థం
# విద్యార్థులకు డ్రెస్సుల పంపిణీ

**వేద న్యూస్, శాయంపేట:**



శాయంపేట మండలం పత్తిపాక గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చదువుతున్న 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు స్వర్గీయ చిట్టిరెడ్డి శ్యాంసుందర్ రెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు స్కూల్ డ్రెస్సులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సతీమణి చిట్టిరెడ్డి భాగ్యలక్ష్మి, కుమారుడు చరిత్ రెడ్డి, కుమార్తె సీమా రెడ్డి విద్యార్థులకు డ్రెస్సులు అందజేశారు. అలాగే 2025 సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన 10 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 1,500 చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వరి, శాయంపేట ఎంఈఓ బిక్షపతి, హైస్కూల్ హెడ్‌మాస్టర్ మాధవి, ప్రైమరీ హెడ్‌మాస్టర్ శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ గజ్జి ఐలయ్య, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గంజాయి రవాణా, విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్

**– 26 గ్రాముల గంజాయి స్వాధీనం**

**వేద న్యూస్, సిద్దిపేట:**




సిద్దిపేట పట్టణంలో గంజాయి రవాణా, విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి 26 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు టూ టౌన్ పోలీసులు కెసిఆర్ నగర్, గుండ్ల చెరువు పరిసర ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా వారి వద్ద గంజాయి లభ్యమైంది. అరెస్టు చేసిన నిందితులు కోడూరు సురేష్ (27), ఆగుళ్ళ ఎల్లేష్ (23)గా గుర్తించారు. వారి వద్ద నుంచి 26 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఉపేందర్ తెలిపారు. గంజాయి విక్రయం, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని, యువత ఇటువంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆయన హెచ్చరించారు.

# కార్మిక వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకోవాలి

**– బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్**
**– తంగళ్లపల్లిలో బీడీ కార్మికుల పని బంద్, నిరసన**

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రంలో బీడీ కార్మికులు పని బంద్ నిర్వహించి కేంద్ర ప్రభుత్వ కార్మిక విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కోడ్‌ల వల్ల కార్మికుల హక్కులు దెబ్బతింటాయని, పని భద్రత తగ్గి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా మారే ప్రమాదం ఉందని అన్నారు. బీడీ పరిశ్రమపై ఆంక్షల కారణంగా వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేసి, కార్మికుల హక్కులను పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆడెపు జ్యోతి, లత, సుమలత తదితర బీడీ కార్మికులు పాల్గొన్నారు.

# కేయూ పీజీ పరీక్షా కేంద్రాల తనిఖీ

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**



కాకతీయ విశ్వవిద్యాలయం పీజీ మూడవ సెమిస్టర్ పరీక్షల నిర్వహణను పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డా. పి. శ్రీనివాస్ పరిశీలించారు. క్యాంపస్‌లోని కామర్స్ కళాశాలతో పాటు నగరంలోని మాస్టర్ జీ డిగ్రీ కాలేజీ, న్యూ సైన్స్ డిగ్రీ అండ్ పీజీ కాలేజీల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును సమీక్షించారు. పరీక్షలు ప్రశాంతంగా, క్రమబద్ధంగా జరుగుతున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. నరసింహ చారి, అధ్యాపకులు డా. ప్రగతి, డా. ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# కేయూ పాలనా శాస్త్ర విభాగంలో విస్తృత ఉపన్యాస కార్యక్రమం



**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

కాకతీయ విశ్వవిద్యాలయంలోని ప్రభుత్వ పాలనా శాస్త్రం మరియు మానవ వనరుల నిర్వహణ విభాగం ఆధ్వర్యంలో గురువారం ఒక రోజు విస్తృత ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విభాగం విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ గంగిడి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ "సిద్ధాంత గ్రంథ రచనలో మెలుకువలు" అనే అంశంపై పరిశోధక విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందించారు. అలాగే విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ ఎం. విద్యాసాగర్ రెడ్డి ఆర్థిక సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థపై చూపిన ప్రభావాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పెద్దమళ్ల శ్రీనివాసరావు, విభాగాధిపతి డా. ఆకుతోట శ్రీనివాసులు, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ డా. చీకటి శ్రీను, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

వేద న్యూస్

శుక్రవారం ఫిబ్రవరి 13, 2026

# కాంగ్రెస్ పార్టీకే ఆధిక్యత

– పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్




**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు కైవసం చేసుకుంటుందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ ధీమా వ్యక్తం చేశారు. సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత 15 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం అహర్నిశలు కృషి చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేకే మహేందర్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈసారి మున్సిపల్‌లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, సీనియర్ నాయకులు వైద్య శివప్రసాద్, నీలి రవీందర్, గోనె ఎల్లప్ప, నక్క నరసయ్య, గొల్లపల్లి పరశురాములు, కాజా మొయినుద్దీన్, నేరెళ్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# వీర్నపల్లిలో కార్మికుల ధర్నా

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:**

– హక్కుల కోసం నిరసన



దేశవ్యాప్త సమ్మెలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రంలో కార్మికులు భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సర్పంచ్ మల్లారపు జ్యోత్స్న, ఉప సర్పంచ్ నరేష్, సీపీఎం నాయకుడు మల్లారపు అరుణ్ కుమార్ తదితరులు హాజరై కార్మికులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, విద్యుత్ సవరణ బిల్లు2025ను ఉపసంహరించుకోవాలని, కార్మికులకు కనీస వేతనం రూ. 26,000 అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# వేములవాడకు మహిళా భక్తుల పాదయాత్ర

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామం నుంచి మహాశివరాత్రి సందర్భంగా మహిళా భక్తులు వేములవాడకు పాదయాత్ర ప్రారంభించారు. గురువారం ఉదయం గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సుమారు 20 మంది మహిళలు 30 కిలోమీటర్ల దూరాన్ని కాలినడకన సాగి శ్రీ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకోవాలని సంకల్పించారు. గ్రామస్తుల శ్రేయస్సు కోసం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు భక్తులు తెలిపారు. గ్రామ సర్పంచ్ దొమ్మాటి నర్సయ్య, ఉపసర్పంచ్ మోతే మధుసూదన్ రెడ్డి పాదయాత్రను ప్రారంభించగా, గ్రామస్తులు భక్తులకు హారతులు ఇచ్చి ఘనంగా వీడ్కోలు పలికారు.

# శివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్

**వేద న్యూస్, వేములవాడ:**



మహాశివరాత్రి జాతర సందర్భంగా వేములవాడలో జరుగుతున్న ఏర్పాట్లను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ గురువారం పరిశీలించారు. పార్కింగ్ ప్రాంతాలు, క్యూ లైన్లు, పారిశుధ్య పనులు తదితర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సులభంగా దర్శనం కల్పించేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ పరిశీలనలో డీఆర్‌డీఓ గీత, ఆర్ అండ్ బీ ఈఈ నరసింహాచారి, డీఈ శాంతయ్య, ఆలయ ఈఈ రాజేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# కొండాపురంలో సబ్‌స్టేషన్ ప్రారంభం

– విద్యుత్ సేవలకు మరింత బలోపేతం
– ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**వేద న్యూస్, నల్లబెల్లి:**

నర్సంపేట నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. నల్లబెల్లి మండలం కొండాపురం గ్రామంలో రూ. 2.46 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఈ సబ్‌స్టేషన్ ప్రారంభంతో కొండాపురం, అసరవెల్లి, మురళీనగర్, గణేశ నగర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరా మెరుగుపడుతుందని చెప్పారు. గ్రామాల అభివృద్ధికి నిరంతర విద్యుత్ సరఫరా కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, వైస్ చైర్మన్ హరిబాబు, విద్యుత్ శాఖ అధికారులు, తహసిల్దార్ కృష్ణ, సర్పంచ్ లలిత సురేష్, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎలుగుబంటి వేషంలో సర్పంచ్

– కోతుల బెడదకు వినూత్న ప్రయత్నం



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం పొన్నాలపల్లె గ్రామంలో కోతుల బెడదతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్లపై దాడులు చేయడం, పంటలను ధ్వంసం చేయడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన గ్రామ సర్పంచ్ మహేష్ వినూత్నంగా ఎలుగుబంటి వేషం ధరించి గ్రామ వీధుల్లో తిరుగుతూ కోతులను తరిమికొట్టే ప్రయత్నం చేశారు. ఎలుగుబంటిని చూసి కోతులు భయపడి వెళ్లిపోవడంతో గ్రామస్తులకు తాత్కాలిక ఉపశమనం లభించింది. కోతుల వల్ల పంటలకు నష్టం వాటిల్లుతున్న నేపథ్యంలో సర్పంచ్ తీసుకున్న ఈ చర్యను గ్రామస్తులు అభినందిస్తున్నారు. అయితే సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# మహా శివరాత్రికి సిద్ధమైన రుద్రగూడెం

– పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక రుద్రాభిషేకం, సాంస్కృతిక కార్యక్రమాలు

**వేద న్యూస్, నల్లబెల్లి:**



నల్లబెల్లి మండలం రుద్రగూడెం గ్రామంలో మహాశివరాత్రి వేడుకల కోసం శివాలయాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. గ్రామపంచాయతీ పాలకవర్గం, గ్రామ పెద్దలు, యువకులు, కుల సంఘాల ప్రతినిధుల సహకారంతో వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 15న ప్రత్యేక రుద్రాభిషేకం నిర్వహించనున్నారు. అలాగే భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు, కోలాటం వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ మహాశివరాత్రి వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరుతున్నారు.

# లేబర్ కోడ్‌లను నిలిపివేయాలి




– కారేపల్లిలో కార్మికుల ధర్నా
– కేంద్ర ప్రభుత్వ విధానాలపై నిరసన

**వేద న్యూస్, కారేపల్లి:**

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే నిలిపివేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా గురువారం కారేపల్లి సింగరేణి బస్ స్టాండ్ నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు కాంట్రాక్ట్ కార్మికులు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కార్మికుల హక్కులను హరించే లేబర్ కోడ్‌లను రద్దు చేసి, పాత కార్మిక చట్టాలను అమలు చేయాలని కోరారు. 12 గంటల పని విధానాన్ని రద్దు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ. 26,000 చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, కొత్త బొగ్గు గనులను సింగరేణి యాజమాన్యమే నిర్వహించాలని సూచించారు. కార్మిక సంఘాలతో చర్చించి ప్రజాస్వామ్యబద్ధంగా నిర్ణయాలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కె. నరేంద్ర, అఖిలభారత రైతుకూలి సంఘం జిల్లా కార్యదర్శి వై. ప్రకాష్, సీపీఎం నాయకులు కొండబోయిన నాగేశ్వరావు, ఇతర కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి జాతరకు పకడ్బందీ భద్రతా

– సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా
– జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

మహాశివరాత్రి జాతర సందర్భంగా భద్రతా ఏర్పాట్లపై జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సమీక్ష సమావేశం నిర్వహించారు. జాతరకు భారీగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఈ నెల 14, 15, 16 తేదీల్లో జరగనున్న జాతరను విజయవంతం చేయడానికి ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లు, క్యూ లైన్ల నిర్వహణ, సీసీ కెమెరాలు, డ్రోన్ నిఘా వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. భీమేశ్వర ఆలయం, బడిపోచమ్మ, నాంపెల్లి, అగ్రహారం ఆలయాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని తెలిపారు. మహిళల భద్రత కోసం ప్రత్యేక బృందాలు, తప్పిపోయిన వారికోసం సహాయక కేంద్రాలు ఏర్పాటు చేయాలని, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెంచాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల కోసం ఫైర్, మెడికల్, రెవెన్యూ శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. జాతర బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీస్ సిబ్బందికి తగిన వసతి, తాగునీరు, భోజన సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ రుత్విక్ సాయి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రచారి, ఇన్స్పెక్టర్లు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కేయూలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె, ధర్నా

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**



కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కాకతీయ విశ్వవిద్యాలయంలో ఉద్యోగ సంఘాలు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం ధర్నా నిర్వహించాయి. విశ్వవిద్యాలయం పరిపాలన విభాగం ఎదుట పెద్ద ఎత్తున ఈ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సమ్మెకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను రద్దు చేసి, కార్మికులు, రైతులకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయం ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వేద న్యూస్



# మున్సిపల్ ఓట్ల లెక్కింపునకు భారీ బందోబస్తు

**– విజయోత్సవ ర్యాలీలపై పూర్తి నిషేధం**

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా సిరిసిల్ల, వేములవాడలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల వద్ద 250 మంది పోలీసులతో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. లెక్కింపు సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ (సెక్షన్ 144) అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలు ప్రకటించే వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉంటుందని తెలిపారు. విజయోత్సవ ర్యాలీలు, బైక్ ర్యాలీలు, సభలు, డీజే కార్యక్రమాలు, టపాకాయలు కాల్చడం, గుంపులుగా గుమికూడడం పూర్తిగా నిషేధించామని స్పష్టం చేశారు. ఎన్నికల నియ



మాలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

# 78 ఏళ్ల రోగికి అడ్వాన్స్‌డ్ టీఏవీఐ ప్రక్రియ




**– ప్రాణాలు కాపాడిన యశోద ఆస్పత్రి వైద్యులు**

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం జిల్లాకు చెందిన 78 ఏళ్ల వాసుదేవమూర్తికి యశోద ఆస్పత్రి వైద్యులు అడ్వాన్స్‌డ్ ట్రాన్స్‌కాథెటర్ అయోర్టిక్ వాల్వ్ ఇంప్లాంటేషన్ (టీఏవీఐ) ప్రక్రియ నిర్వహించి ప్రాణాలు కాపాడారు. గుండె వాల్వ్ తీవ్రంగా ఇరుకుగా మారడంతో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్న ఆయనను అత్యవసరంగా సోమాజిగూడ యశోద ఆస్పత్రికి తరలించారు. పరీక్షల్లో అయోర్టిక్ వాల్వ్ తీవ్రంగా ఇరుకుగా ఉన్నట్లు గుర్తించడంతో, ఓపెన్ హార్ట్ సర్జరీ ప్రమాదకరమని భావించిన వైద్యులు కోత లేకుండా టిఏవిఐ ప్రక్రియ నిర్వహించారు. 26 ఎంఎం మెడ్ట్రానిక్ ఎవోలట్ వాల్వ్‌ను ఉపయోగించి విజయవంతంగా చికిత్స అందించారు. శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్యం మెరుగుపడి వెంటిలేటర్ సపోర్ట్ నుంచి బయటపడి సాధారణ స్థితికి చేరుకున్నట్లు కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్ డా. జగదీష్ మాదిరెడ్డి తెలిపారు. వృద్ధులు, హై రిస్క్ రోగులకు టిఏవిఐ ప్రక్రియ ప్రాణాలను కాపాడే ఆధునిక చికిత్సగా ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యమకారుల సంక్షేమం కోసం కట్టుబడి ఉన్నాం

**– వారికి తగిన గుర్తింపు ఇవ్వాలి**
**– టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం**

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం తెలంగాణ జనసమితి పార్టీ కట్టుబడి ఉందని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. నేలకొండపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన పాలేరు నియోజకవర్గ టీజేఎస్ జనరల్ బాడీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో అనేక మంది ఉద్యమకారులు త్యాగాలు చేశారని, వారికి తగిన గుర్తింపు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యమకారులంతా ఐక్యంగా ఉండి తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. టీజేఎస్ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేసే పార్టీ



అని స్పష్టం చేశారు. సమావేశానికి ముందు కోదండరాంను కోలాటం బృందంతో ఘనంగా స్వాగతించి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్రావు, రాష్ట్ర నాయకులు తిప్పని సిద్ధులు, జిల్లా నాయకులు మాదాసు శ్రీనివాసరావు, బెల్లంకొండ నాగేశ్వరరావు, బట్టు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పౌర బాధ్యతలో 'లండన్' మాధురి ఆదర్శం

**– మాధురి పౌర బాధ్యతను అభినందించిన మున్సిపల్ కమిషనర్ అయాజ్**

**వేద న్యూస్, జమ్మికుంట:**

ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఎన్నో ప్రచారాలు చేస్తున్న వేళ, ఒక యువతి తీసుకున్న నిర్ణయం అధికారులను సైతం ఆశ్చర్యపరిచింది. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని, కొత్తపల్లికి చెందిన కొక్కుల మాధురి, లండన్ దేశంలో స్థిరపడినప్పటికీ, తన బాధ్యతను మరువకుండా స్వగ్రామానికి చేరుకుని ఓటు హక్కు వినియోగించుకోవడం విశేషం. జమ్మికుంట మున్సిపాలిటీ 20వ వార్డు నుంచి బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన తల్లి కొక్కుల శ్రీలత-కేదారేశ్వర్ కు మద్దతుగా నిలవడమే కాకుండా, ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామి కావాలని ఆమె నిర్ణయించుకున్నారు. మాధురి చూపిన ఈ అచంచలమైన పౌర బాధ్యతను తెలుసుకున్న జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్, స్వయంగా ఆమె నివాసానికి వెళ్ళి ప్రత్యేకంగా అభినందించారు. విదేశాల్లో ఉంటూ కూడా మన దేశ ప్రజాస్వామ్య ప్రక్రియపై గౌరవంతో



ఇంత దూరం వచ్చి ఓటు వేయడం యువతకు ఆదర్శమని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆమెను సన్మానించి, బాధ్యతాయుతమైన పౌరురాలిగా ఆమె చూపిన చొరవను ప్రశంసించారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న తల్లికి మద్దతుగా లండన్ నుంచి వచ్చిన కూతురి ప్రేమ, ఓటుపై ఆమెకున్న అవగాహన ఇప్పుడు పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

# ఆదర్శ ఫౌండేషన్‌కు శ్రీచైతన్య సీబీఎస్ఈ స్కూల్ విరాళం

**వేద న్యూస్ హైదరాబాద్ :** అమీర్‌పేటలోని శ్రీచైతన్య సీబీఎస్ఈ స్కూల్‌లో ఇటీవల ఫుడ్ ఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా వచ్చిన నిధులను ఆదర్శ ఫౌండేషన్‌కు విరాళంగా అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులంతా కలిసి ఆదర్శ ఫౌండేషన్‌కు వెళ్లి అక్కడి చిన్నారులకు సామాగ్రి, భోజనాన్ని పంపిణీ చేశారు. స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు చాలా ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొని మానవత్వం, సేవా భావం ఎంత ముఖ్యమో చాటి చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయని స్కూల్ మేనేజ్ మెంట్ తెలిపింది.

# ఎమ్మెల్యేతో ఆలయ చైర్మన్ మర్యాదపూర్వక భేటీ

**వేద న్యూస్, నల్గొండ ప్రత్యేక ప్రతినిధి:**



వేములపల్లి మండలం ఆమనగల్ గ్రామంలోని శ్రీరామలింగేశ్వర దేవాలయ నూతన చైర్మన్ బ్రహ్మదేవర విద్యాసాగర్ గురువారం మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహాశివరాత్రి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పిల్లల సందీప్, ఎలికట్టి భరత్, మండల నాయకులు రావు ఎల్లారెడ్డి, నామిరెడ్డి యాదగిరి రెడ్డి, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్-44పై ప్రమాదం

**– ద్విచక్ర వాహనదారుడు మృతి**



**వేద న్యూస్, తూప్రాన్:**

ఎన్‌హెచ్-44 జాతీయ రహదారిపై రాంగ్ రూట్‌లో వెళ్తున్న ద్విచక్ర వాహనం టెంపోను ఢీకొనడంతో వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదం మసాయిపేట్ సమీపంలో జరిగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం.. ద్విచక్ర వాహనదారుడు రాంగ్ సైడ్‌లో ప్రయాణిస్తూ ఎదురుగా వస్తున్న టెంపోను ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలై ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ ఘటనను గమనించిన జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. మృతదేహాన్ని తరలించి, ట్రాఫిక్‌ను క్లియర్ చేసి వాహన రాకపోకలను పునరుద్ధరించారు

# శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**– జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**




**వేద న్యూస్, మంచిర్యాల:**

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్-సెటి ఆధ్వర్యంలో నస్పూర్‌లో ఏర్పాటు చేసిన గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలు అభివృద్ధి చేసుకుని స్వయం ఉపాధి పొందాలని సూచించారు. నిరుద్యోగ యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందన్నారు. రోబోటిక్స్, ఎలక్ట్రికల్, ఇతర సాంకేతిక కోర్సుల్లో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు, ఆర్ - సెటి ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# జాతీయ మహిళా దినోత్సవం

**– సమానత్వం కోసం సాగుతున్న పోరాటంఁ సాధికారత దిశగా భారత ప్రయాణం**
**– మహిళ బలపడితేనే సమాజం బలపడుతుంది**

**వేద న్యూస్ డెస్క్:**

భారతదేశ చరిత్రను తిరగేసినా, ఆధునిక భారతాన్ని పరిశీలించినా ప్రతి దశలో మహిళల పాత్ర స్పష్టంగా కనిపిస్తుంది. కుటుంబానికి పునాది వేయడమే కాదు, సమాజానికి దిశానిర్దేశం చేసినవారూ మహిళలే. అయినప్పటికీ సమానత్వం, గౌరవం, అవకాశాల విషయంలో ఇంకా ఎన్నో అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఈ వాస్తవాన్ని గుర్తు చేస్తూ మహిళా సాధికారత, సామాజిక న్యాయం, సమానత్వంపై చర్చించేందుకు జరుపుకునే రోజే జాతీయ మహిళా దినోత్సవం. ఇది ఒక ఉత్సవం మాత్రమే కాదు సమాజానికి ఒక ప్రశ్న.

మహిళలు నేడు ప్రతి రంగంలో ముందంజలో ఉన్నారు. విద్య, వైద్యం, శాస్త్ర సాంకేతికం, రక్షణ, రాజకీయాలు, క్రీడలు, వ్యాపారం ఏ రంగాన్నైనా పరిశీలిస్తే మహిళల కృషి స్పష్టంగా కనిపిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థిక స్వావలంబన సాధిస్తున్న మహిళలు ఉన్నారు. మహానగరాల్లో పెద్ద సంస్థలను నడిపిస్తున్న మహిళలు ఉన్నారు. కుటుంబ బాధ్యతలతో పాటు వృత్తి జీవితాన్ని సమతుల్యం చేస్తూ నిలబడుతున్న మహిళల సంఖ్య పెరుగుతోంది. అయినప్పటికీ ఈ ప్రయాణం అంత సులభం కాదు.

లింగ వివక్ష ఇప్పటికీ అనేక రూపాల్లో కొనసాగుతోంది. బాలికల విద్యలో అంతరాలు, ఉద్యోగాల్లో అసమాన వేతనాలు, నిర్ణయాత్మక స్థాయిల్లో తక్కువ ప్రాతినిధ్యంఇవి ఇంకా వాస్తవాలే. చట్టాలు ఉన్నా అమలులో లోపాలు ఉన్నాయి. మహిళలపై హింస, వేధింపులు, భద్రత సమస్యలు సమాజానికి సవాలుగా మారుతున్నాయి. ఈ పరిస్థితి మారాలంటే కేవలం చట్టాలు సరిపోవు. దృక్పథం మారాలి. కుటుంబాల్లోనే సమానత్వ విలువలు నాటాలి.

మహిళా సాధికారత అంటే కేవలం ఉద్యోగం ఇవ్వడం కాదు. ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించడం మాత్రమే కాదు. నిర్ణయాల్లో భాగస్వామ్యం, స్వతంత్ర ఆలోచనకు గౌరవం, భద్రతతో కూడిన వాతావరణం ఇవి కలిసినప్పుడే నిజమైన సాధికారత సాధ్యమవుతుంది. ఒక మహిళ ఆర్థికంగా బలపడితే కుటుంబం బలపడుతుంది. కుటుంబం బలపడితే సమాజం స్థిరపడుతుంది. అందుకే మహిళా సాధికారతను దేశాభివృద్ధి కోణంలో చూడాలి. విద్య మహిళ సాధికారతకు ప్రధాన ఆయుధం. బాలికలకు సమాన విద్యా అవకాశాలు కల్పించకపోతే సమానత్వం సాధ్యం కాదు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యలో మధ్యలోనే మానేయడం తగ్గించాలి. ఉన్నత విద్య, నైపుణ్యాల పెంపు, సాంకేతిక పరిజ్ఞానం మహిళలకు అందుబాటులో ఉండాలి. విద్య ద్వారా మాత్రమే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అదే సాధికారతకు పునాది. రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం పెరగాల్సిన అవసరం ఉంది. నిర్ణయాల స్థాయిలో మహిళలు ఉండాలి. మహిళల సమస్యలను మహిళలే బలంగా ప్రతినిధ్యం వహించాలి. స్థానిక సంస్థల నుంచి జాతీయ స్థాయి వరకు మహిళల ప్రాతినిధ్యం పెరిగితే విధానాల్లో మార్పు వస్తుంది. ఇది సమాజానికి సమతుల్య దిశను ఇస్తుంది.

భద్రత కూడా కీలక అంశం. భయం లేకుండా చదవడం, మహిళల భద్రతను కాపాడాల్సిన బాధ్యత ఉంది. మహిళలపై జరిగే అన్యాయాలకు సహించని సంస్కృతి పెరగాలి.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073